సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



దుందుభీ.. బందీ

జడ్చర్ల పరిధిలో పారుతున్న దుందుభీ వాగు అక్రమార్కుల చేతిలో బందీ అయ్యింది.

వివరాలు IIలో ▸



వెళ్లొస్తాం.. లింగమయ్యా

నల్లమలలో వెలసిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు ముగిశాయి.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.7/23.7

జిల్లాలో ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలవుతుంది. మధ్యాహ్నం, సాయంత్రం వడగాలుల ప్రభావం, ఉక్కపోత ఉంటాయి.

నిరాశాజనకం..!

ఇంటర్ ఫలితాల్లో ఆశించినంతగా రాణించని విద్యార్థులు

- **మొదటి ఏడాది 53శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 21వ స్థానం**
- **ద్వితీయంలో 63 శాతం ఉత్తీర్ణతతో 23వ స్థానం**
- గతంలో పోల్చితే స్వల్పంగా పెరిగిన ఉత్తీర్ణత శాతం
- కొనసాగిన బాలికల హవా



గద్వాల: విద్యార్థుల జీవితాల్లో కీలకమైన ఇంటర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. అయితే జిల్లాలో పరిశీలిస్తే ఆశాజనకంగా లేకపోవడం కలవరపరుస్తుంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండింటా జిల్లా విద్యార్థులు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం స్వల్పంగా పెరిగిందని చెప్పవచ్చు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలో 53 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే 21వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 63 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే 23వ స్థానంలో నిలిచింది. గతంలో మాదిరిగా ఈ సారి కూడా బాలుర కంటే బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు.

ఫలితాలు ఇలా..

■ ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 3,257 మంది విద్యార్థులకుగాను 1,167 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 1,491 మంది బాలురకు గాను 575 మంది (39శాతం), 1,766 మంది బాలికలకుగాను 1,167 మంది (66శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. మొత్తం 53 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 21వ స్థానంలో నిలిచింది.

■ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2,948 మంది విద్యార్థులకుగాను 1,852 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 1,371 మంది బాలురకు గాను 711 మంది (52శాతం) ఉత్తీర్ణులయ్యారు. 1,577 మంది బాలికలకుగాను 1,141 మంది (72శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇక్కడ కూడా బాలికల ఉత్తీర్ణత శాతమే ఎక్కువగా ఉంది. మొత్తం 63 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే 23వ స్థానంలో నిలిచింది. ఉత్తీర్ణత శాతంలో గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం కొంత ఎక్కువనే చెప్పవచ్చు.

ఒకేషనల్‌లో మెరుగు

ప్రస్తుత వృత్తివిద్య(ఒకేషనల్) పరీక్ష ఫలితాలు మెరుగుపడ్డాయి. మొదటి సంవత్సరంలో విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం కొంత వరకు మెరుగుపడింది. వృత్తి విద్య మొదటి సంవత్సరం పరీక్షల్లో 733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 443 మంది (60శాతం) ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం వృత్తివిద్యా పరీక్ష ఫలితాల్లో 634 మందికి గాను 459 మంది (72శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర స్థాయిలో 5వ స్థానంలో నిలిచింది.

కేజీబీవీల్లో మంచి ఫలితాలు

జిల్లాలోని కేజీబీవీలు ఇంటర్‌లో మంచి ఫలితాలను సాధించాయి. జిల్లాలో 12 కేజీబీవీలు ఉండగా.. గద్వాల, గట్టు, అయిజ, వడ్డేపల్లి, మానవపాడు, అలంపూర్ కేజీబీవీలలో మాత్రమే ఇంటర్ తరగతులు కొనసాగుతున్నాయి.

■ గద్వాల కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరంలో 69 మందికి గాను 47 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 74 మందికి 63 మంది పాసయ్యారు. ఫస్టియర్ ఎంపీసీలో ఇందు 458, బైపీసీలో స్రవంతి 424 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. సెకండియర్ ఎంపీసీలో పూజిత 907 మార్కులు, బైపీసీలో దేవి 940 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు.


జిల్లా టాపర్లు వీరే..

ప్రభుత్వ కళాశాలలలో చదివిన పలువురు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో గద్వాల మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థిని జనీరా తబుసుమ్ 464 మార్కులు, నిషాపర్వీన్ 464 మార్కులు, మానవపాడు ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థిని ధృవతార 464 మార్కులు, అయిజ ప్రభుత్వ కళాశాల విద్యార్థి సతీష్ 463 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో అయిజ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని రేణుక 428 మార్కులు, గట్టు ప్రభుత్వ కళాశాల విద్యార్థిని సింధు 427 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో గద్వాల కళాశాల విద్యార్థి పాండు 450 మార్కులు, హెచ్ఈసీ విభాగంలో గట్టు కళాశాల విద్యార్థి రాము 457 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో గద్వాల మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలకు చెందిన విద్యార్థినీ ఉషాశ్రీ 986 మార్కులు, మదీయాబేగం 980 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.

■ అయిజ కేజీబీవీలో మొదటి సంవత్సరంలో 24 మందికి గాను 20 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 27 మందికి గాను 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గట్టు కేజీబీవీ మొదటి సంవత్సరంలో 68 మంది విద్యార్థులుకు గాను 66 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 70 మందికి గాను 69 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వడ్డేపల్లి కేజీబీవీ మొదటి సంవత్సరంలో 47 మంది విద్యార్థులుకు గాను 31 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 49 మందికి గాను 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలంపూర్ కేజీబీవీ మొదటి సంవత్సరంలో 60 మంది విద్యార్థులుకు గాను 29 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 29 మందికి గాను 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మానవపాడు కేజీబీవీ మొదటి సంవత్సరంలో 15 మంది విద్యార్థులకు గాను 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.


మొదటి సంవత్సరం ఫలితాలు..

జిల్లా	హాజరైన విద్యార్థులు	పాసైనవారు
మహబూబ్‌నగర్	8,962	4,834
జోగులాంబ గద్వాల	3,257	1,742
వనపర్తి	5,458	2,881
నాగర్‌కర్నూల్	5,363	2,444
నారాయణపేట	3,781	1,675



ద్వితీయ సంవత్సరం ఫలితాలు ..

జిల్లా	హాజరైన విద్యార్థులు	పాసైనవారు
మహబూబ్‌నగర్	7,909	5,078
జోగులాంబ గద్వాల	2,948	1,852
నాగర్‌కర్నూల్	4,941	2,918
వనపర్తి	4,888	3,165
నారాయణపేట	3,386	1,822



■ సత్తాచాటిన గురుకులాలు

ప్రభుత్వ సెక్టార్‌లో ఉన్న వివిధ గురుకులాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో సత్తాచాటారు. ఒకటి రెండు మినహా మిగిలిన అన్ని గురుకులాలు మెరుగైన ఫలితాలను సాధించాయి. గట్టు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేటీదొడ్డి బీసీ సంక్షేమ బాలురు గురుకుల కళాశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు.

■ ప్రైవేట్ కళాశాలలు డీలా..

రూ.వేలకు వేలు ఫీజులు తీసుకుంటూ గొప్పగొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రైవేటు కళాశాలలు ఫలితాలలో డీలపడ్డాయి. జిల్లాలో 13 ప్రైవేటు కళాశాలలు ఉంటే మొదటి సంవత్సరం ఫలితాలలో ఏ ఒక్క కళాశాల కూడా 60 శాతం ఉత్తీర్ణత దాటలేదు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఒక కళాశాల మినహా మిగిలిన అన్ని కళాశాలలు ఉత్తీర్ణత దారుణంగా ఉంది. సగం కళాశాలల పాస్ పర్సెంటేజీ 30 శాతం కూడా దాటలేదంటే వాటి బోధన తీరు ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు.

జోరందుకున్న నామినేషన్లు

- **పాలమూరు**లో 7, నాగర్‌కర్నూల్‌లో 4 దాఖలు
- **నేటితో ముగి**యనున్న గడువు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నాగర్‌కర్నూల్: లోక్ **సభ ఎన్నికల** నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం ఆరోరోజు మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఏడుగురు అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్లు అందజేశారని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. ఇందులో తెలంగాణ జాగీర్ పార్టీ అభ్యర్థిగా ఎస్.నరేష్‌రెడ్డి, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా బి.రవీందర్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా జి.రాకేశ్, స్వతంత్ర అభ్యర్థులుగా గోవిందమ్మ, బండ సత్యనారాయణ, వెంకటరమణ, కారుకొండ శ్రీనివాసులు నామినేషన్లు దాఖలు చేశారు.

■ నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి బుధవారం నాలుగు నామినేషన్లు వచ్చాయని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఇందులో విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా ఒగ్గు వినయ్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా విసనకర్ర అమర్నాథ్, స్వతంత్ర అభ్యర్థులుగా గీత, లంద భిక్షపతి నామినేషన్లు దాఖలు చేశారన్నారు. కాగా.. ఇక్కడి పార్లమెంట్ స్థానానికి ఇప్పటి వరకు 15 మంది అభ్యర్థులు మొత్తం 23 నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. గురువారం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు ఉందని ఆయన పేర్కొన్నారు.



నాగర్‌కర్నూల్ కలెక్టర్‌కు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న భిక్షపతి

ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

గద్వాల క్రైం: జిల్లా పరిధిలోని ఏదేని సమస్యపై ప్రజలు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన క్రమంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అలాగే ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పత్రాన్ని తప్పనిసరిగా పొందాల్సిందిగా ఎస్పీ రితిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు సేవలు తక్షణమే బాధితులకు అందజేయాలనే లక్ష్యంతో పోలీసు శాఖ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు స్టేషన్‌లో సమస్యలపై ఇచ్చిన అర్జీని సంబంధిత అధికారులు ఎన్ని రోజుల్లో కేసు నమోదు చేసి విచారణలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టారనే అంశంపై దృష్టి సారించిందని తెలిపారు. ఏవేని వస్తువులు, సామగ్రి దుకాణాల్లో కొనుగోలు చేసినప్పుడు బిల్లు తీసుకోవడం ఎంతో ముఖ్యమో అలాగే స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు ఈ పత్రాన్ని అలాగే తీసుకోవాలని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకునేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు.



పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లకు ఇంటివద్ద నుంచే ఫారం–12డి ద్వారా దర ఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మే 13వ తేదీన జరిగే పోలింగ్ సజావుగా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం మాక్‌పోల్ నిర్వహించాలని, ప్రతిరెండు గంటలకు తప్పకుండా పోలింగ్ వివరాలను సమర్పించాలని పోలింగ్ ప్రక్రియలో ఈవీఎం యంత్రాలు ఇబ్బందులకు గురైతే వెంటనే రిజర్వ్‌లో ఉన్న ఈవీఎం యంత్రాలను సెక్టార్ అధికారులు మార్చే విధంగా సన్నద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి అనుమానాలకు దారితీసే విధంగా అధికారుల వ్యవహారం ఉండొద్దన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామ్‌చందర్, ఎస్‌డీసీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

గద్వాల అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు తండా, గట్టు మండలం వాయిలకుంటకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎస్టీలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు.మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్,తాన్యానాయక్, నాగేందర్ యాదవ్, శ్రీనివాసులు ఉన్నారు.



- అక్రమార్కుల చెరలో వాగు పరివాహక ప్రాంతం
- దర్జాగా నడివాగులోకి చొచ్చుకువచ్చి ప్రహరీ నిర్మాణం
- చెరువులు, కుంటలది సైతం అదే పరిస్థితి
- జాతీయ రహదారి బ్రిడ్జికి పొంచి ఉన్న ముప్పు
- తారస్థాయికి చేరిన రియల్ వ్యాపారుల బరితెగింపు

దుందుభీ.. బందీ


జాతీయరహదారి బ్రిడ్జికి ముప్పు వాటిల్లేలా నిర్మించిన ప్రహరీ


అల్వాన్‌పల్లి వద్ద దుందుభీ వాగులోకి అడ్డంగా నిర్మించిన ప్రహరీ


మట్టితో చదును చేసిన దుందుభీ వాగు పరివాహక ప్రాంతం

జడ్చర్ల: నియోజకవర్గంలో రియల్ వ్యాపారుల బరితెగింపు తారస్థాయికి చేరింది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, భూదాన్, దేవాలయం భూములకు ఎసరు పెట్టిన అక్రమార్కులు వాగులు, వంకలు, చెరువులు, కుంటలపై పడ్డారు. ఇప్పటికే రియల్ భూంలో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలు, గుట్టలు ఉనికి కోల్పోగా.. భూగర్భజలాలకు ఆయువు పట్టుగా ఉన్న దుందుభీ వాగును సైతం చెరపట్టారు. ఈ ప్రాంతంలో ప్రధానమైన దుందుభీ వాగుకు ముప్పు వాటిల్లే విధంగా అక్రమార్కులు చెలరేగుతున్నారు. ఏకంగా వాగులోకి చొచ్చుకువచ్చి నడి మధ్యలో అడ్డంగా రాతి గోడ నిర్మించి మట్టితో చదును చేస్తున్నారు. ఫలితంగా ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారంగా ఉన్న దుందుభీ అక్రమార్కుల చేతుల్లో బక్క చిక్కి బిక్కుబిక్కుమనే దుస్థితికి చేరుకుంది.

ఎక్కడంటే..

మండలంలోని అల్వాన్‌పల్లి- కుర్వగడ్డపల్లి గ్రామాల మధ్య గుండా పారుతున్న దుందుభీ వాగుకు ఒక వైపు కుర్వగడ్డపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు దగ్గరగా పరివాహక ప్రాంతాన్ని కొందరు ఆక్రమించారు. అదేవిధంగా మరోవైపు తంగెళ్లపల్లి గ్రామానికి వెళ్లే దారిని అనుసరించి దుందుభీ వాగులోకి చొచ్చుకు వచ్చి ప్రహరీ నిర్మించి మట్టితో పూడ్చే పనులు చేపట్టారు. వాగు అంతర్భాగంలోకి చొచ్చుకువచ్చి ఏకంగా రాతి గోడ నిర్మించి మట్టితో పూడ్చి చదును చేస్తున్నారు. వాగుపై నిర్మించిన జాతీయ రహదారి వంతెన మొదలుకొని శ్రీపరుష వేదీశ్వరస్వామి (మీనాంబరం) ఆలయం వరకు గల భూమిని అనుసరించి వాగు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించేశారు.

90 మీటర్ల వరకు..

దుందుభీ వాగు పరివాహక ప్రాంతంలో 90 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు పేర్కొంటున్నారు. వాగు పరివాహక ప్రాంతంతోపాటు జాతీయ రహదారి బ్రిడ్జి కూడా ఇక్కడ ఉన్నా అక్రమార్కులు ఏమాత్రం ఖాతరు చేయకుండా తమ పనులు కొనసాగిస్తున్నారు.

బాదేపల్లి నల్లకుంటకు ఎసరు

బాదేపల్లి నడిబొడ్డున ఉన్న నల్లకుంటలో సైతం వెంచర్ ఏర్పాటు చేసేందుకు రియల్ వ్యాపారులు మట్టితో నింపేశారు. తమ పట్టా భూమిని వదిలి కుంట బఫర్ జోన్‌లోకి వచ్చి ఆక్రమించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా అంతంత మాత్రంగానే చర్యలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

విచ్చలవిడిగా ఆక్రమణలు

నియోజకవర్గంలో ఎక్కడికక్కడ చెరువులు, కుంటలను రియల్ వ్యాపారులు ధ్వంసం చేశారు. వీరికి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు ఉండటంతో అడ్డు చెప్పే పరిస్థితి లేకుండాపోయింది. జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి, బూరెడ్డిపల్లి గ్రామాల శివారులో చెరువులను నేలమట్టం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన గండెమ్మ చెరువును పెకిలించి ఆనవాళ్లు లేకుండా చేసి వెంచర్‌లో కలిపేశారు. ప్రస్తుతం ఇక్కడ వందల ఎకరాల విస్తీర్ణంలో మౌలిక వసతులతో వెంచర్ ఏర్పాటు చేశారు. ఇదే వెంచర్‌ను అనుసరించి ఉన్న మురుగువాని కుంట కట్టను సైతం వెంచర్‌లో కలిపేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బాదేపల్లిలోని ఊరచెరువులో సైతం వెంచర్ ఏర్పాటు చేశారు. జడ్చర్ల చెరువు శిఖంలోనూ ప్లాట్లు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. గంగాపూర్ శివారు వెంగలాయకుంటను నామరూపాలు లేకుండా చేసి వెంచర్‌లో కలిపేశారు. బాలానగర్ పెద్ద చెరువు నాలా ఆక్రమణకు గురైందని ఏకంగా స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జడ్చర్ల- గంగాపూర్ మధ్యలో ఓ వెంచర్ నిర్వాహకులు చెరువు కట్టను ఆక్రమించి ప్రహరీ నిర్మించినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.


చట్టరీత్యా నేరం..

దుందుభీ వాగు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించడం చట్టరీత్యా నేరం. వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
– నరేష్, చిన్ననీటిపారుదల శాఖ జేఈ

వంతెనకు ముప్పు..

అల్వాన్‌పల్లి- కుర్వగడ్డపల్లి గ్రామాల మధ్యలో 167 నంబర్ జాతీయ రహదారికి సంబంధించిన భారీ బ్రిడ్జి దుందుభీ వాగుపై నిర్మించారు. బ్రిడ్జికి నిర్మించిన ఖానాలకు అడ్డంగా గోడ నిర్మించి మట్టితో చదును చేశారు. బ్రిడ్జికి రెండు వైపులా ఇదే విధంగా మట్టిని నింపి చదును చేయడంతో భవిష్యత్‌లో బ్రిడ్జికి సైతం ప్రమాదం పొంచి ఉండే పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో ఎగువ నుంచి వరద ప్రవాహం అతివేగంగా ఉంటుంది. ఈ సమయంలో వాగుకు అడ్డుగా కట్టిన గోడల వలన నీరు ముందుకు వెళ్లే పరిస్థితిలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ ప్రాంతంలో నిల్వ ఉధృతి మరింత పెరిగి ఒకేసారి వరద ముందుకు పరవళ్లు తొక్కే సమయంలో బ్రిడ్జిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో బ్రిడ్జి వరద ధాటికి దెబ్బతిని నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి.

వెళ్లొస్తాం.. లింగమయ్యా


స్వామి వారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సలేశ్వరం లింగమయ్య

- ముగిసిన సలేశ్వరం ఉత్సవాలు
- మూడు రోజుల్లో 2 లక్షల మంది దర్శనం
- ఈఏడాది ఎండల తీవ్రతతో తగ్గిన భక్తుల రద్దీ

అచ్చంపేట: నల్లమల లోతట్టు ప్రాంతంలో వెలసిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు ముగిశాయి. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి వాహనాలు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ నిలిపివేసింది. ఈసారి ఎండల తీవ్రత.. రెండేళ్లుగా అటవీ శాఖ అనుసరిస్తున్న తీరుతో భక్తుల రద్దీ కొంతమేర తగ్గింది. మూడు రోజుల్లో సుమారు 2 లక్షల మంది సలేశ్వరం లింగమయ్యను దర్శించుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణ పేరుతో వారం రోజుల ఉత్సవాలను అటవీ శాఖ ఏటేటా తగ్గిస్తూ రావడంతో భక్తుల రాక తగ్గిందని చెంచు ఇతర నాయకులు పేర్కొంటున్నారు. కాగా, ప్రతి ఏడాది చైత్రశుద్ధ పౌర్ణమి రోజున వర్షం కురిసేది. వర్షంతో వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈసారి వర్షం లేకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలతో నల్లమల అభయారణ్యం శివనామస్మరణతో మార్మోగింది. చివరి రోజున భక్తులు వస్తున్నాం లింగమయ్యా.. వెళ్లొస్తాం లింగమయ్య అంటూ భక్తి పారవశ్యంతో తరలివచ్చారు.

చెక్‌పోస్టులు మూసివేత..

ఫర్హాబాద్, అప్పాయిపల్లి ప్రాంతంలోని చెక్‌పోస్టులను మూసివేశారు. గతంలో మాదిరిగా శ్రీశైలం వెళ్లే యాత్రికులను మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద రాత్రి 9 గంటల వరకు అనుమతిస్తారు. రోజూ 43 బస్సుల చొప్పున సలేశ్వరం యాత్రికులకు అందుబాటులో ఉంచిన ఆర్టీసీ.. చివరి రోజున మధ్యాహ్నం 2 గంటలకే బస్సులను నిలిపివేసింది.

పకడ్బందీగా పోలీసు బందోబస్తు..

గత ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పోలీస్, అటవీశాఖ సంయుక్తంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అడవిలో చెత్త తొలగింపు, ట్రాఫిక్, లోయ వద్ద భక్తుల రద్దీ నియంత్రణను పోలీస్, అటవీ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక వ్యూహాన్ని అమలుచేశారు. భక్తుల రద్దీ పెద్దగా లేకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కాగా, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన అన్నదానం, అంబలి కేంద్రాలు, తాగునీటి వసతి భక్తులకు ఎంతగానో ఉపకరించాయి. సలేశ్వరం ఉత్సవాలు అటవీశాఖకు మంచి ఆదాయ వనరుగా మారిందనే చర్చ సాగుతోంది.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత



పాలమూరు: జిల్లా కేంద్రంలోని పోచమ్మ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎంఈఓ పద్మనాభాచారి(81) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పాలమూరు మెడికల్ కళాశాలకు భార్య తులసి, కూతుళ్లు సుజన, ధార్మిక శైలి అప్పగించారు. ఈసందర్భంగా కళాశాల డాక్టర్ నవ కళ్యాణి మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యార్థులకు అప్పగించిన మృతదేహాల నుంచి ఎంతో నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈసందర్భంగా పద్మనాభాచారి కుటుంబ సభ్యులను అభినందించారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్లుగా నిలవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్లుగా నిలవాలని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ బిన్ మక్సూద్, నసరుల్లా హైదర్ అన్నారు. మియాపూర్ బౌరంపేట్‌లో గురువారం నుంచి ఈ నెల 27 వరకు కొనసాగే జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్లను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చని అన్నారు. ఉపాధ్యక్షుడు సయ్యద్ షరీఫ్, కోచ్ ఎండి.ఖలీల్, ఉస్మాన్, దీశాంత్ పాల్గొన్నారు.

బాలుర జట్టు.. మహ్మద్ అబ్దుల్ రాఫే, వివేక్, రాజా రాంచరణ్, సయ్యద్ ఉజేర్ అబ్దుల్లా, ఖలీల్, భానుప్రకాశ్, అదిత్, మహ్మద్ హుస్సేన్, యశ్వంత్, ప్రణయ్, రాంచరణ్, యోగీశ్వర్. **బాలికల జట్టు..** హర్షిత, సాయినిఖిత, వైష్ణవి, చైత్ర, శ్రీజ, దర్శిని, పవిత్ర, హరిణి, మిధున, భావన, సోను, నవ్యశ్రీ.

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇవి మామూలు ఎన్నికలు కావని, పార్లమెంట్ చరిత్రను తిరగరాసే ఎన్నికలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో డీసీసీ కార్యాలయం ఆవరణలో బుధవారం పార్లమెంట్ కేంద్ర కార్యాలయాన్ని పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని వివిధ వార్డులు, మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత పాలకులు ఈ జిల్లా అభివృద్ధిని మరిచారని, కాని మన జిల్లా బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. లక్షాముప్పైవేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ లోక్‌సభ నియోజవర్గాన్ని రూ.లక్ష కోట్లతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా పనిచేయాలి

అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీకి ఇప్పుడు మన బలం పెరిగిందని మరింతగా ఉత్సాహంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఒకరి మీద ఒకరు ఫిర్యాదులు చేసే పరిస్థితిని వదిలిపెట్టాలన్నారు. పార్టీకి ఎవరు ద్రోహం చేసినా చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు అభివృద్ధిని బీజేపీ అడ్డుకుంటుందని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, సురేందర్‌రెడ్డి, ఏపీ.మిథున్‌రెడ్డి, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన కారు
- కారు వచ్చి ఆటోపై పడిపోవడంతో గుంతలో పడిన ఆటో

వెల్దండ: మండలంలోని కొట్ర- వెల్దండ ప్రధాన రహదారి మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొట్రకి చెందిన వసంతపు మహేష్(30) తన బావ మరిది పెళ్లి నిమిత్తం రంగారెడ్డి జిల్లా చుక్కాపూర్‌కు వెళ్లాడు. వివాహం పూర్తయిన తర్వాత తన సొంత గ్రామానికి కారులో తిరుగు పయనమయ్యాడు. అదే సమయంలో బల్మూర్‌కు చెందిన విజయ(44), తన భర్తతో పాటుగా వారి కుటుంబ సభ్యులు ఆరుగురితో కలిసి ఆటోలో తన సోదరుడి వివాహానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరారు. కొట్రకు దగ్గరలోని హోటల్ వద్దకు రాగానే కారు డ్రైవింగ్ చేస్తున్న మహేష్ ఆటోను ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లాడు. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ ప్రైవేట్ బస్సు, కారును బలంగా ఢీకొంది. ఆ సమయానికి ఆటో కూడా పక్కకు రావడంతో కారు వచ్చి ఆటోపై పడిపోయింది. ఆటోలోని వారికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవింగ్ చేస్తున్న మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. విజయ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె భర్త పరిస్థితి సైతం విషమంగా ఉందని వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు. పెళ్లిలో ఆనందంగా గడుపుతున్న సమయంలో రోడ్డు ప్రమాద విషయం తెలియటంతో వారంతా అక్కడకు చేరుకున్నారు. ఒక్క రోడ్డు ప్రమాదం రెండు పెళ్లిల్లో విషాదాన్ని మిగిల్చింది. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలియజేశారు.

రామన్‌పాడులో 1,012 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,012 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

నేటినుంచి ఓపెన్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ఎస్సెస్సీకి 12, ఇంటర్‌కు 19 కేంద్రాల ఏర్పాటు
- ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో నిర్వహణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం సెషన్ 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష జరుగుతున్న సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ తోపాటు చుట్టుపక్కల ఉండే జిరాక్సు సెంటర్లను మూసివేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షకు 12 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 2,864 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అలాగే ఇంటర్ పరీక్షకు 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,013 మంది విద్యార్థులు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసురావొద్దని అధికారులు సూచించారు.

పకడ్బందీగా నిర్వహణ

జిల్లావ్యాప్తంగా ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాం. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లొద్దు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.
– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

అన్ని వసతులు కల్పించాం..

వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లావ్యాప్తంగా అన్ని పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాం. ఉన్నతాధికారుల సూచన మేరకు పరీక్షలు సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.
– రాంసుభాష్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగు


మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందుతున్నారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు ఏకమై బీఆర్ఎస్‌ను ఓడించాయన్నారు. పంటలు ఎండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయని.. కాల్వలు తవ్వితే చెరువులు నిండే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రత్యేకంగా అదిచేస్తుంది.. ఇది చేస్తుందని చెప్పాల్సిన అవసరమే లేదన్నారు. కరెంట్ పోయినా, రైతుబంధు పడకపోయినా బీఆర్ఎస్ ప్రచారమే అని అన్నారు. కాగా, సమావేశం ముగిసేంత వరకు కరెంటు సరఫరా లేకపోవడంతో వారు కర్రలతో ఫ్యాన్లు తప్పి, ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర ఈనెల 26న జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్‌కు చేరుకొని న్యూటౌన్, బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, క్లాక్‌టవర్ చౌరస్తా వరకు రోడ్‌షో నిర్వహిస్తారని తెలిపారు. క్లాక్‌టవర్ చౌరస్తాలో కేసీఆర్ మాట్లాడుతారని పేర్కొన్నారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాంహౌజ్‌లో రాత్రికి బస చేస్తారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గంజి వెంకన్న, కె.నర్సింహులు, శివరాజ్, రవికిషన్‌రెడ్డి, ఆర్.రామకృష్ణ ఉన్నారు.

వాహన తనిఖీల్లో రూ.5,40,220 నగదు పట్టివేత


పోలీస్ చెక్‌పోస్టు వద్ద సీజ్ చేసిన నగదుతో ఎస్‌ఐ తిరుపాజి తదితరులు

అలంపూర్: రాష్ట్ర సరిహద్దు వద్ద వాహన తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పత్రాలు లేని నగదును తనిఖీ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా జాతీయ రహదారిపై ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహన తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో రూ.3,97,420 నగదు పట్టుబడినట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద చేసిన తనిఖీల్లో సలీం పాష వద్ద రూ.లక్ష, షేక్ మహ్మద్ పాష రూ.లక్ష, ఎండీ ఇమ్రాన్ వద్ద రూ.80 వేలు, ఎం.విశ్వనాథ్ రెడ్డి వద్ద 58,920, షేక్ అబ్దుల్లా వద్ద రూ.58,500 నగదు లభించినట్లు చెప్పారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు వివరించారు.

రాజాపూర్ శివారులో రూ.77,800

రాజాపూర్: రాజాపూర్ శివారులో రంగారెడ్డిగూడ వద్ద జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి చిత్తూర్ వెళ్తున్న డీసీఎంను తనిఖీ చేయగా.. రూ.77,800 నగదు లభ్యమైందని, వాటిని ఎలక్షన్ గ్రీవెన్స్ కమిటీ మహబూబ్‌నగర్‌కు అందజేశామని రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలియజేశారు.

బాలానగర్ వద్ద రూ.65,000 నగదు..

బాలానగర్: బాలానగర్ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఎలాంటి పత్రాలు లేకుండా హైదరాబాద్ వైపు నుంచి వనపర్తి వైపుగా వెళ్తున్న వనపర్తి జిల్లా రామన్‌పాడ్ మండలానికి చెందిన పెద్ద నర్సింహ నుంచి రూ.65,000 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు.

ఇంటర్ ఫలితాల్లో 'ప్రతిభ'


విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈఓ శ్రీధర్‌సుమన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో శివశంకర్ 469 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. హన్షిక 468, యశ్వంత్‌రెడ్డి 468, రమేష్ 468, మార్కులు సాధించారు. బైపీసీ మొదటి సంవత్సరంలో శ్రావ్య 437, మంజు 436, జైన్‌బిన్ మహ్మద్ 436, కిరణ్ 436 మార్కులు సాధించారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో సాత్విక 992, కావ్య 991, నమిత 990, లక్ష్మీ ప్రవళిక 990, బైపీసీ రెండో సంవత్సరంలో చంద్రిక 988, సౌందర్య 986 మార్కులు సాధించారు. విద్యార్థులను డీఐఈఓ శ్రీధర్‌సుమన్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

'రిషి' విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ రెండో సంవత్సరం అమూల్య 993, సాకేత్ సింగ్ 991 మార్కులు సాధించారు. బైపీసీ రెండో సంవత్సరంలో హమీదున్నిసాబేగం 989, దానియా నాజీష్ 987, అనన్య 985, అంకితారెడ్డి 983, సుమేధాచంద్ర 982 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో విజ్ఞ 468, వర్షిణి 468, సాయితరుణ్, భావన, హిమబిందులు 438 మార్కులు సాధించారు. కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంపై కరస్పాండెంట్ చంద్రకళావెంకట్, సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిబాబు విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన 'వాగ్దేవి'


విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈఓ శ్రీధర్‌సుమన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. బైపీసీ రెండో సంవత్సరంలో మునావర్ ఫాతిమా 992, ఎంపీసీ విభాగంలో సోనియా 990, మొదటి సంవత్సరంలో బైపీసీలో సఫూరా 438, మొదటి సంవత్సరం ఎంపీసీలో రేవంత్‌రెడ్డి 466, ముజామిల్ 466, ఇర్ఫాన్ 465, నవనీత్‌కుమార్‌గౌడ్ 465 మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడం జిల్లాకే గర్వకారణం అని, విద్యార్థులకు మెరుగైన విద్య అందించినందుకు ఇంతటి ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. విద్యార్థులకు డీఐఈఓ శ్రీధర్‌సుమాన్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ నీట్ ఇన్‌చార్జి పావని, సూపరింటెండెంట్ సందీప్‌రెడ్డి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రద్ధ' విద్యార్థుల ముందంజ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని శ్రద్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు ముందంజలో నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో హఫ్స నాజ్‌నీన్ 460, శ్రీనిష్‌రెడ్డి 452, బైపీసీ విభాగంలో స్వర్ణ కుమారి 430, హినబేగం 429, సీఈసీ విభాగంలో సానియా అంజుమ్ 485, శ్రీహిత 484, ఎంఈసీలో సౌమ్యశ్రీ 477 మార్కులు సాధించారు. రెండో సంవత్సరంలో బైపీసీ విభాగంలో నిమ్రా అంజుమ్ 988, సిమ్రోజ్ ఫాతిమా 981, బైపీసీ విభాగంలో నందకిషోర్ 979, అక్షిత 978 మార్కులు సాధించారు. మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ జగపతిరావు అభినందించారు. ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, మధుమోహన్, సురేష్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన నదిగ్రహారంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాల మేరకు.. పట్టణంలోని నదిగ్రహారానికి చెందిన బోయ లక్ష్మి(50) బుధవారం ఇంట్లో దుస్తులు శుభ్రం చేసేందుకు బోర్ మోటార్‌ను ఆన్ చేసింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అమాంతం కిందపడింది. గమనించిన భర్త రాముడు, కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందింది. కళ్ల ముందే భార్య మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు.

స్కూల్లో మ్యాథ్స్ అవర్... సైన్స్ అవర్ అంటుంటాం.
చట్టసభలో జీరో అవర్ అనే మాట వింటుంటాం.
స్టోరీ అవర్... ఈ గంట ఎక్కడ నుంచి వచ్చింది?
నీలిమ పెనుమర్తి ఆలోచన నుంచి వచ్చింది.
రోజుకో గంట కథలు వినమని చెప్తున్నారామె.
యూకేలో ఆచరణలో పెట్టి... ఇండియాకి తెచ్చారు.
విశ్వవ్యాప్తం చేయడానికి కంకణం కట్టుకున్నారు.
ఆడియో బుక్స్‌తో స్వచ్ఛమైన భాష నేర్పిస్తున్నారు.

కథలకో గంట 1/24

నీలిమ చెప్పే కథ చదవండి!


నీలిమ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నీలిమ ఉన్నత విద్య కోసం యూకేకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పిల్లల పెంపకంలో కథలు కూడా ఒక భాగం అయి తీరాలని నమ్ముతారామె. మనదేశంలో స్కూల్ కరికులమ్‌లో పిల్లలకు కథలు లేకపోవడం విచారకరం అంటారామె. కథ ప్రాధాన్యం తెలిసిన అభివృద్ధి చెందిన దేశాలు పిల్లల రోజువారీ క్రమంలో ఓ గంట కథల కోసం కేటాయిస్తున్నాయని, మన దగ్గర అది లోపించడంతో ఎంత పెద్ద చదువులు చదివినప్పటికీ ఒక విషయాన్ని చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన నైపుణ్యం కొరవడుతోందన్నారు నీలిమ. భాష ఏదైనా ఆ భాషలో పదాలను స్పష్టంగా ఉచ్చరించడం అలవాటు చేయాలంటే ఇంట్లో తల్లిదండ్రులు అంత స్వచ్ఛంగా మాట్లాడే నేపథ్యం ఉండాలి. ఆ వెసులుబాటు లేని పిల్లలకు తన ప్రయత్నం మంచి భాషను, చక్కటి భావ వ్యక్తీకరణను నేర్పిస్తుందన్నారు నీలిమ. ఏడేళ్ల కిందట 'స్టోరీ అవర్' ఆలోచనకు బీజం పడిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నా రామె.

ఓ గంట నిడివిలోనే కథ

''నాకు లండన్ ఇంపీరియల్ కాలేజ్‌లో కెమిస్ట్రీలో ఎంఎస్ చేయడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. మా వారు కూడా స్కాలర్‌షిప్ మీద లండన్‌లోనే వచ్చారు. అలా 30 ఏళ్ల కిందట యూకేకి వెళ్లడం, చదువు, ఉద్యోగం, ఇద్దరు పిల్లలతో అక్కడే సెటిలయ్యాం. రెండవసారి గర్భిణిగా ఉన్నప్పుడు పీహెచ్‌డీలో విరామం తీసుకున్నాను. ఆ విరామం నా ఆలోచనలను కథల మీదకు మళ్లించింది. పెద్ద బాబుకి కథలు చెప్పడం మొదలుపెట్టాను. అమరచిత్ర కథ చదవడం అలవాటు చేశాను. అదే చిన్నబాబుకి కూడా అలవడింది. మా అబ్బాయిలిద్దరూ గ్రీక్ పౌరాణిక గ్రంథాలను కూడా చదివారు. వాళ్లిద్దరి మాటల్లో ఆ పాత్రల గురించిన చర్చ వస్తుండేది. అప్పుడు మన రామాయణాన్ని పరిచయం చేశాను. అదే సమయంలో మా పెద్దబ్బాయి స్కూల్ వాళ్లిచ్చిన ప్రాజెక్ట్ కోసం ఒక స్టోరీ బోర్డ్ చేయాల్సి వచ్చినప్పుడు రామాయణం ఇతివృత్తంగా చేశాడు. ఆ తర్వాత పిల్లలకు సెలవుల్లో రామాయణం మీద వాళ్ల వెర్షన్ రాయమని చెప్పాను. ఆ టాస్క్‌లో మరో చాలెంజ్... కథనం గంటకు మించరాదు. తమకు తోచినట్లు ఎడిట్ చేసుకుంటూ సీతారామలక్ష్మణులు యుద్ధం తర్వాత విజేతలై అయోధ్యకు రావడం దీపావళి వేడుక చేసుకోవడంతో ముగింపు ఇవ్వాలన్నమాట. ఆ సాధన ఆడియో బుక్ ఆలోచనకు రూపమిచ్చింది.



సమయం లేని తల్లిదండ్రుల కోసం...

ఇప్పుడు ఉద్యోగాలు దాదాపుగా అందరి జీవితాలనూ సంక్షిప్తంగా మార్చేస్తున్నాయి. ఇలాంటప్పుడు పిల్లలకు కథ చెప్పాలని ఉన్నప్పటికీ కొంతమందికి అందుకోసం ఓ గంట సమయం కేటాయించలేని పరిస్థితి ఉంటోంది. వాళ్లకు ఉపయోగపడేటట్లు కథలకు ఆడియో బుక్ రూపమిచ్చాను. దానిని ఇంగ్లిష్, హిందీ, తెలుగులో తెచ్చాను. మా పిల్లలు శ్రేయాస్, ఆయుర్ ఇద్దరూ హిస్టరీ చదివారు. అక్కడ హిస్టరీ అంటే రష్యన్ విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, ప్రపంచ యుద్ధాలు ప్రధానంగా ఉంటాయి. మా పిల్లలు అలాగే యూకేలో ఉన్న భారతీయమూలాలున్న పిల్లలకు మన చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశంతో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ఫ్రమ్ ద మొఘల్స్ టు ద మహాత్మా' పేరుతో మరో ఆడియో బుక్ చేశాను. ఆ స్టోరీ ఈస్ట్ ఇండియా కంపెనీ మనదేశంలో అడుగు పెట్టడం నుంచి మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సముపార్జన వరకు సాగింది. అలాగే మన సామెతలను పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'తాతమ్మ కథలు'. మా అమ్మ, నాన్న, అత్త, మామగారితో ఒక్కో సామెతకు ఒక్కో కథ రాయించి వాటిని ఐదు నిమిషాలకు మించకుండా ఎడిట్ చేసి రికార్డ్ చేశాను. మొత్తం పన్నెండు కథలు, గంట ఆడియో. ఈ కథలకు నాకు మాల్గుడి డేస్ స్ఫూర్తి. యూకేలోని తెలుగు కుటుంబాల పిల్లలు ఈ కథలను వినడం మొదలు పెట్టిన తర్వాత తొలి రోజుకి పన్నెండవ రోజుకీ వారి ఉచ్చారణ మారిపోయింది. కథకు అంతటి శక్తి ఉంటుందనే నా నమ్మకం నిజమేనని నిరూపితమైంది. తోలుబొమ్మలతో చేసిన ప్రయోగానికి చాలా ఖర్చయింది. కానీ అది కూడా సంతృప్తినిచ్చింది. ఆరు పాత్రలతో కథను అల్లుకుంటూ రాసుకున్నాం. ఆడియో బుక్ అనువాదాలకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ (ఉప్పల్) విద్యార్థులు, బేగంపేటలోని దేవనార్ (అంధ విద్యార్థుల పాఠశాల) స్కూల్ విద్యార్థులు గళమిచ్చారు.

– నీలిమ పెనుమర్తి, స్టోరీ అవర్ రూపకర్త


ఆడియో బుక్‌కి గళం ఇస్తున్న దేవనార్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య, అనిల్, రంజిత్ (ఫైల్ ఫొటో)

పిల్లలే పాట రాశారు!

మాల్గుడి డేస్ వీడియోలకు సిగ్నేచర్ ట్యూన్ ఉన్నట్లే మా ఆడియో బుక్స్‌కి కూడా ట్యూన్ ఉండాలని పాట కోసం ప్రయత్నించాను. పిల్లలకు ఇస్తే ఎలా రాస్తారో చూద్దామని యూకేలో శచి అనే అమ్మాయికిచ్చాను. తాను రామాయణం కథను ఒక్క వాక్యంలో 'వారధి నిర్మాణం సీత మీద రాముడికి ఉన్న ప్రేమకు ప్రతిబింబం' అనే భావంతో రాసింది. అలాగే భారతీయ మూలాలు ఏ మాత్రం లేని 'ఎవీ సిమన్స్' అనే అమ్మాయి 'లైట్ ద ల్యాంప్స్' పేరుతో సీతారాములు విజేతలుగా అయోధ్యకు వచ్చి దీపావళి వేడుక చేసుకోవడాన్ని రాసింది. మంథర విషపూరిత వచనాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో వివరించింది.

క్రియేటివ్‌గా సైన్స్ పాఠాలు

బాల్యంలో మేము బాలానందం వినేవాళ్లం. సరళంగా సాగే కథనాలు పిల్లల్ని అలరించేవి. నా ఆడియోబుక్స్ కూడా సులువుగా ఉంటాయి. ఇవన్నీ 'స్టోరీ అవర్ డాట్ కో డాట్ యూకే' వెబ్‌సైట్‌లో ఉచితంగా ఉన్నాయి. భాష శుద్ధంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే శుద్ధంగా ఉంటాయని నా అభిప్రాయం. మంచి భాష మాట్లాడితే వ్యక్తి గౌరవం పెరుగుతుంది. ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సరే... మంచి భాష ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. మంచి ఉచ్చారణ వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది. అందుకే సైన్స్ సబ్జెక్ట్‌ని కూడా ఈ క్రియేటివ్ మీడియం ద్వారా వివరించాలనేది నా ఆకాంక్ష'' అని తన ప్రయత్నం వెనుక ఉన్న పరమార్థాన్ని వివరించారు నీలిమ పెనుమర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

వందేళ్ల చరిత్ర ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
ఎప్పుడూ ఒక మహిళను వైస్ చాన్సలర్‌గా చూడలేదు.
కాని మొదటిసారి ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వి.సి.గా నియమించారు.
దీంతో నైమా ఖాతూన్ చరిత్ర సృష్టించారు.
ఆమె మైనారిటీ వర్గ మహిళలకు గొప్ప స్ఫూర్తి కాగలదంటూ
శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నైమా ఖాతూన్ పరిచయం.

న్యూస్‌మేకర్


ప్రొఫెసర్ నైమా ఖాతూన్

వందేళ్లకు ఆమె వచ్చింది

నైమా ఖాతూన్‌కు ముస్లిం మహిళల చదువు గురించి చాలా పట్టింపు ఉంది.

'ఉత్తరాదిలో నేను ప్రిన్సిపాల్‌గా పని చేసిన అలీగఢ్ విమెన్స్ కాలేజ్ చాలా ముందంజలో ఉంది. అక్కడ మూడు వేల మంది ముస్లిం ఆడపిల్లలు చదువుకుంటున్నారు. కాని ఇదొక్కటే సరిపోదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ముస్లిం బాలికల విద్య చాలా వెనుకబడి ఉంది. దక్షిణాదిలో ముస్లిం సమూహాలు విద్యారంగంలో ముస్లిం బాలబాలికలను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాదిలో ఆ పని జరగడం లేదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని జయించాలంటే విద్యార్జనకు మించిన వేరే మార్గమేదీ లేదు' అంటుందామె.

విద్యారంగంలో బాలికల విద్య కోసమే కాదు ఉన్నతవిద్యలో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే నైమా ఖాతూన్‌ను భారత ప్రభుత్వం గుర్తించి రెండు రోజుల క్రితం అత్యంత ప్రతిష్టాత్మకమైన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌ను చేసింది. దాదాపు 100 ఏళ్లకు మించిన ఘన చరిత్ర ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి ఇలా ఒక మహిళ వి.సి. పదవిలో కూచోవడం ఇదే మొదటిసారి.

గమనించాల్సిన విషయం ఏమంటే ఇన్నాళ్లు పురుషులు మాత్రమే వి.సి.లుగా ఉన్న జె.ఎన్.యుకు శాంతిశ్రీ పండిట్ మొదటి మహిళా వి.సి. కావడం, అలాగే జామియా మిలియా ఇస్లామియాకు నజ్మా అఖ్తర్ తొలి వి.సి. కావడం (ఆమె పదవీకాలం ముగిసింది) పాతమూసలను బద్దలు చేయడమే. ఆ వరుసలో ఇప్పుడు నైమా ఖాతూన్ చేరారు.

రాజకీయ ప్రాతినిధ్యం

భారతదేశంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని నైమా ఖాతూన్ అంటారు. ముఖ్యంగా అణగారిన వర్గాల స్త్రీలు పార్లమెంట్ వరకూ చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఉన్నాయని, రాజకీయ అధికారం లేకుండా కీలకమైన విధానమార్పు తేలేమని అభిప్రాయపడతారు. 'ఆర్థిక శక్తిని, రాజకీయ శక్తిని పొందడటంలో అణగారిన వర్గాల స్త్రీలు నిస్సహాయంగా ఉన్నారు' అంటారామె.

సైకాలజీ ప్రొఫెసర్

ఒడిశాకు చెందిన నైమా ఖాతూన్ ఉన్నత విద్య అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలోనే జరిగింది. అక్కడే ఆమె బి.ఏ. సైకాలజీ చదివింది. ఆ తర్వాత పి.హెచ్‌డి. వరకూ అక్కడే కొనసాగి 1988లో అదే యూనివర్సిటీలో లెక్చరర్‌గా తన ప్రయాణం మొదలెట్టింది. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది సైకాలజీ డిపార్ట్‌మెంట్ చైర్‌పర్సన్ అయ్యింది. పొలిటికల్ సైకాలజీ అధ్యయనంలో భాగంగా 'హిందూ ముస్లిం యువతపై రాజకీయ భావోద్వేగాల ప్రభావం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్‌డి. కీలకమైనది. అలీగఢ్ విమెన్స్ కాలేజ్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉండగా ఆమెను వి.సి.గా పని చేసే అవకాశం వరించింది. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది కనుక ఇ.సి. అనుమతి తీసుకోని ఆమె నియామకం చేసింది ప్రభుత్వం. నైమా ఖాతూన్ తరచూ అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తన పరిశోధనా పత్రాలను సమర్పిస్తుంటారు.

బ్యూటిప్



- చేతులు, పాదాలపై నల్లటి మచ్చలుంటే వాడేసిన నిమ్మతొక్కతో రుద్దితే పోతాయి.
- సమ్మర్‌లో బయటకు వెళ్లేటప్పుడు పాదాలకు సాక్స్ వేసుకుంటే పగుళ్ళు రాకుండా ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్‌తో ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి.
- పదిహేను రోజులకు ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి.
- స్నానం పూర్తయిన తర్వాత పమిస్ స్టోన్‌తో పాదాలను మెల్లగా రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి పాదాలు నునుపుగా ఉంటాయి.

కొత్త దారి

బాధ పడి ఆ బాధను కాలగమనంలో మరచిపోయేవారు కొందరు.

బాధ పడి ఆ బాధలో నుంచి కొత్త అడుగు వేసేవారు కొందరు.

కలైయారసి రెండో కోవకు చెందిన మహిళ.

నేతకార్మికుల బంగారు కాలాన్ని కళ్లతో చూసిన కలైయారసి అవే కళ్లతో వారి కష్టాలను చూసింది. ఆ బాధలో నుంచి 'రాట్టై' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

సంప్రదాయ నేతకళకు డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) కిట్స్ ద్వారా కొత్త వెలుగు తెస్తోంది తమిళనాడుకు చెందిన కలైయారసి రామచంద్రన్. పిల్లలు, పెద్దలు ఉపయోగించేలా ఈ కిట్‌ను డిజైన్ చేశారు. సంప్రదాయ కళకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్న కలైయారసి గురించి....


కలైయారసి

నేతకళ నేస్తం

సాఫ్ట్‌వేర్ టు వీవింగ్

కొన్ని సంవత్సరాల క్రితం...

'చదువుకోవాలని ఉంది' అని తన మనసులోని మాటను భర్తకు చెప్పింది కలైయారసి. పెళ్లికి ముందు పై చదువులు చదువుకోదానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడలుగా నిలిచాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కలైయారసి మనసులో మాట విన్న భర్త 'తప్పకుండా' అని ప్రోత్సహించాడు. అలా కలైయారసి ఎంసీఏ పూర్తి చేసింది. ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా పని చేసింది.

ఈరోడ్(తమిళనాడు) జిల్లాలోని సాలంగపాలయం గ్రామానికి చెందిన కలైయారసి నేతకార్మికుల కుటుంబం నుంచి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసినా నేతకళపై ఆమెకు ఉన్న ప్రత్యేకాభిమానం మాత్రం దూరం కాలేదు. సెలవుల్లో సొంత ఊరుకు వచ్చిన కలైయారసి అక్కడ నేతకార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. ఊళ్లో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కు పడిపోయింది.

కష్టాలలో ఉన్న నేతకార్మికులకు ఆసరాగా నిలవడానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది కలైయారసి. నేతకళ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొని 'రాట్టై హ్యాండ్లూమ్' పేరుతో స్వగ్రామంలో ఎకో–ఫ్రెండ్లీ హ్యాండ్లూమ్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత కోణంలో ఆలోచించి ఆర్గానిక్ క్లాత్ వీవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

'నేతపని ద్వారా ఉపాధి పొంది సంతోషంగా ఉన్న కార్మికుల ఆర్థికపరిస్థితి ఆ తరువాత దిగజారిపోయింది.

చాలామంది ఉపాధి వెదుక్కుంటూ పట్టణాల బాట పట్టారు. డబుల్ షిఫ్ట్‌లలో పనిచేసేవాళ్లు. కొందరు వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లిదండ్రులు ఊళ్లో లేకపోవడంతో పిల్లల చదువు గాడి తప్పింది. తమిళనాడులో ఎన్నో గ్రామాలకు వెళ్లి నేతకార్మికులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నాను. ఈ పరిస్థితి నాకు బాధాకరంగా అనిపించింది' అంటున్న కలైయారసి తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి నేతకళను స్వయంగా నేర్చుకుంది. సహజరంగులతో పాటు అరటి పీచు, జనపనార, ఇతర పదార్థాలతో తయారుచేసిన సేంద్రియ నూలును 'రాట్టై' ఉపయోగిస్తోంది. ప్రస్తుతం 28 కుటుంబాల వరకు 'రాట్టై హ్యాండ్లూమ్' కోసం పనిచేస్తున్నాయి.

సంప్రదాయ చేనేత వస్త్రాలకు ఊతం ఇచ్చేందుకు పోర్టబుల్ డిఐవై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనకు శ్రీకారం చుట్టింది కలైయారసి.

ఎక్కడికంటే అక్కడికి చేతితో తీసుకెళ్లగలిగే ఈ మగ్గాలకు యూజర్ మాన్యువల్, క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా యూట్యూబ్ వీడియోల సహాయంతో పరికరాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు. తమిళనాడులోని ఎన్నో స్కూల్స్‌లో పిల్లల దగ్గర పోర్టబుల్ లూమ్స్ కనిపిస్తున్నాయి. స్కూల్స్‌లో వీవింగ్ క్లబ్స్ ఏర్పాటు కావడం మరో విశేషం. మూడు ఆప్షన్‌లలో, మూడు స్థాయుల్లో అందుబాటులో ఉన్న వీటిని పెద్దలు, పిల్లలు ఉపయోగించవచ్చు.

'రాట్టై' స్టార్టప్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. టాన్‌సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇనోవేషన్ మిషన్) ద్వారా పది లక్షల గ్రాంట్ వచ్చింది.

'నేతకార్మికులకు ఉపాధి కల్పించడమే కాదు ఈ తరానికి ఆ కళపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా చేయాలనేది నా లక్ష్యం' అంటుంది కలైయారసి.

పిల్లల కోసం వర్క్‌షాప్



'రాట్టై' ద్వారా నేత కార్మికులకు అండగా నిలిస్తూనే మరో వైపు నేతకళపై పిల్లలకు అవగాహన, ఆసక్తి కలిగించడానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది కలైయారసి. పెద్దలకు 'నేతపనిని స్ట్రెస్‌–బస్టింగ్ ఎక్సర్‌సైజ్‌గా పరిచయం చేస్తోంది. వీలైనన్ని ఎక్కువ స్కూల్స్‌కు వెళ్లి పిల్లలకు నేత కళ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక ఆర్ట్‌గా మన విద్యావిధానంలో నేతకళ భాగం కావాలని ఆశిస్తున్నాను' అంటుంది కలైయారసి.

ఈ భూగోళం మీద ప్లాస్టిక్ తొడుగు ఉంది. అది నీటిలో నానదు. మట్టిలో కలవదు.
నిప్పులో కాల్చితే విషంగా మారుతుంది. అలాంటి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. లేదా రీసైకిల్ చేయాలి.
అందుకే అసోంలోని ఆ స్కూల్ 2016లో వృథా ప్లాస్టిక్కే స్కూల్ ఫీజ్‌గా ప్రారంభమైంది.
ఏడేళ్లు గడిచినా దిగ్విజయంగా నడిచి పర్యావరణ హితమైన స్కూల్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

• వినూత్నం

ఆ స్కూల్ ప్లాస్టిక్‌పై గెలిచింది

ఫీజుకు బదులు ప్లాస్టిక్ వేస్ట్‌ను ఎవరైనా తీసుకుంటారా? ఆ స్కూల్‌లో తీసుకుంటారు. ఎంత వేస్ట్ తెస్తే అంత మెచ్చుకుంటారు కూడా. పర్మితా శర్మ, మజిన్ ముక్తార్ అనే పర్యావరణ ప్రేమికుల, బాలల హితుల వినూత్న ఆలోచన ఇది. అసోంలోని పమోహీలో 'అక్షర్'పేరుతో వీరిద్దరూ ఒక పాఠశాల స్థాపించారు 2016లో. దీనిని భిన్నంగా నడపాలని నిశ్చయించుకున్నారు. చదువు, స్కిల్స్, పర్యావరణ స్పృహ సిలబస్‌గా ఉండాలనుకున్నారు. అందుకే ఫీజు కట్టాలంటే నోట్లు తేవద్దు వేస్ట్ ప్లాస్టిక్ తెండి అని చెప్పసాగారు. వీలైనన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకెళ్తే ఫీజు కట్టినట్లు రసీదు ఇస్తారు. మరో విషయం ఏమిటంటే ఇక్కడ విద్యార్థులను వారి వయసును బట్టి కాకుండా అవగాహన స్థాయిని బట్టి తరగతుల్లో వేస్తారు. ఎనిమిదేళ్లు వచ్చిన వారు 3వ క్లాస్‌లో ఉండాలని రూల్ లేదు. నాలుగులో ఉండొచ్చు లేదా రెండులోనూ ఉండొచ్చు.


స్కూల్ ఫీజుగా ప్లాస్టిక్‌ను ఇస్తున్న విద్యార్థులు


ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలని

మనుషులు బాగా చలి పుడితే దేనితోనైనా చలిమంట వేసుకోవడానికి వెనుకాడరు. అసోంలో చలి ఎక్కువ. కాని కట్టెలు ఖర్చు. అందుకే చలిమంటల కోసం ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను తెచ్చి మంటల్లో వేయసాగారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం పర్యావరణానికి తీవ్రమైన హాని. దీనిపై అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం రాలేదు. దానికి తోడు ప్లాస్టిక్ తగులపెట్టడం వల్ల వెలువడే విష వాయువులు పీల్చి పిల్లలు జబ్బు పడసాగారు. దీంతో సామాజిక కార్యకర్త అయిన పర్మితా శర్మకు ఓ ఆలోచన తట్టింది. తన మిత్రుడు, అమెరికాలో బాలల విద్యారంగంలో పని చేస్తున్న నిపుణులు మజిన్‌తో తన ఆలోచనను పంచుకుంది. అసోం భౌగోళిక పరిస్థితుల గురించి, అక్కడ నెలకొన్న సవాళ్ల గురించి మజిన్‌కు వివరించింది. అలా వారిద్దరి ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చిందే 'అక్షర్' విద్యాలయం.

ఎవరు చేరుతారు?

స్కూలంటే డబ్బు తీసుకుని చదువు చెప్పాలి. ప్లాస్టిక్ తెండి స్కూల్‌లో చేరండి అంటే ఎవరు చేరతారు. పైగా సంప్రదాయ విద్యకు, వృత్తి విద్యకు మధ్య వారధిగా ప్రారంభించిన ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం మొదట్లో సవాలుగానే మారింది. ఇక అక్కడి పేద పిల్లలు దగ్గర్లోనే ఉన్న రాళ్ల క్వారీలలో పనిచేస్తారు. వారిని బడికి పంపిస్తే ఆదాయం కోల్పోతామని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపేందుకు ససేమిరా అన్నారు. దీంతో తల్లిదండ్రుల అవసరాలకు తగిన విధంగా స్కూల్ సమయాన్ని, బోధనను 'అక్షర్' లో రూపకల్పన చేశారు.

ప్లాస్టిక్ ఇటుకలు

'అక్షర్'లో నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన మెషినరీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తారు. పాత ప్లాస్టిక్‌తో ఇటుకలు తయారు చేస్తారు. వీటిని నిర్మాణాల్లో వాడొచ్చు. పిల్లలు స్కూల్ అయ్యాక ఈ ఇటుకల తయారీ నేర్చుకుంటున్నారు. అలాగే పూలకుండీలు, బౌల్స్ వంటివి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రెండున్నర వేల ప్లాస్టిక్ బాటిళ్లు, ఏడు లక్షల ప్లాస్టిక్ కవర్లు ఇక్కడ రీసైకిల్ అయ్యాయి. అసోంను ప్లాస్టిక్ పీడ నుంచి విముక్తం చేయాలంటే తమ స్కూల్ మోడల్‌ని ఫాలో కావాలని పర్మిత, మజిన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి 5 స్కూళ్లు ఈ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అంటే ఫీజుగా ప్లాస్టిక్‌ను తీసుకుంటున్నాయి. మరో వంద స్కూళ్లు ఇలా చేస్తే బాగుంటుందని పర్మిత, మజిన్ భావిస్తున్నారు. అసోంలో మాత్రమే కాదు దేశమంతా ఈ మోడల్‌ను ఉపయోగిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను కచ్చితంగా తరిమికొట్టడం వీలవుతుంది.